బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: బక్రీద్ పండుగ నేపథ్యంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఉజాలేషాహ ఈద్గా సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, వాటర్ వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, ఏరియా మేనేజర్ అల్తాఫ్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న ఉన్నారు.

హైదరాబాద్ హరికేన్ జట్టుకు ధరావత్ సురేష్ ఎంపిక



ఎల్‌బీనగర్: నియోజకవర్గం చంపాపేట డివిజన్‌కు చెందిన ధరావత్ సురేష్ వీల్ చైర్ క్రికెట్ (ఆరవ ఐడబ్ల్యూపీఎల్ ఇండియన్ వీల్ చైర్ క్రికెట్ ప్రీమియం లీగ్) హైదరాబాద్ హరికేన్ జట్టుకు ఎంపికై వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. ఈ నెల 8 నుంచి 14 వరకు న్యూఢిల్లీలోని సెక్టార్‌బార బాల్‌భవన్ ఇంటర్నేషనల్ స్కూల్ పోటీలను నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు.

పూడికతీత పనులు పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న నాలాల పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని సర్కిల్ డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆదేశించారు. సర్కిల్ పరిధి మన్సూరాబాద్ డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులను పూర్తి చేసి కాలనీలకు వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా చైతన్య కుమార్



సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా ఎస్.చైతన్య కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ నగర స్పెషల్ బ్రాంచ్ విభాగం డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.చైతన్య కుమార్ సౌత్‌ఈస్ట్ జోన్‌కు డీసీపీగా బదిలీపై వచ్చారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి వి.సైదా నాయక్, ఎల్‌బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు వెంకన్న, రాజు, ప్రకాష్, రఘుపతిరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయ పునర్నిర్మాణ 12వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ఆలయ పూజారులు వేదాంత రాజనర్సింహాచార్యులు, పవన్ కుమార్ ఆచార్యుల చేతుల మీదుగా అమ్మవారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అష్టోత్తర మండపారాధన, ధ్వజారోహణ పూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా సాయంత్ర షోడశ ఆరాధన, మహిళా మాతృమూర్తులతో లలితా సహస్ర కుంకుమార్చన, మహాహారతి, ఉత్సవ విగ్రహాలతో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ సభ్యులు, వివిధ ఆలయాల అధ్యక్ష, కార్యదర్శులు, బస్తీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆలయ వార్షికోత్సవాలను ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడదాం

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని హస్తినాపురం డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు ఎరుకల మల్లేశ్‌గౌడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలంటే అందరూ మొక్కలను నాటాలన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు

న్యూ నాగోల్ కాలనీలో

నాగోలు: అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం కార్పొరేటర్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి ఠాకూర్ అశ్విన్ సింగ్, సాయినాథ్ గౌడ్, కాట విజయ గౌడ్, యు రామకృష్ణ, తోట మహేందర్ యాదవ్, రాకేష్ యాదవ్, లావణ్య పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురం పనామా, చింతలకుంట, వనస్థలిపురం రెడ్ వాటర్‌ట్యాంక్, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం కూడళ్లలో ఆయన ప్లకార్డులతో వాహనదారులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు.

ఎల్‌బీనగర్‌లోని పలు డివిజన్లలో..

ఎల్‌బీనగర్: అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్‌లోని పలు డివిజన్‌లో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మొక్కలను నాటారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన పోటీల్లో జాగృతి అభ్యుదయ సంఘానికి రాష్ట్రస్థాయి ప్రథమ, తృతీయ బహుమతులు లభించారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలోని ఓపెన్ జిమ్‌లో పర్యావరణ ప్రేమికుడు లింగారెడ్డి (టీచర్) సహకారంతో మొక్కలు నాటారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు మొక్కలు నాటారు.



న్యూనాగోలు కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



ఓపెన్‌జిమ్‌లో మొక్కలు నాటుతున్న కాలనీవాసులు



బహుమతులు అందుకుంటున్న జాగృతి అభ్యుదయ సంఘం



పెద్దచెరువులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



మొక్కలు నాటుతున్న మల్లేశ్‌గౌడ్

సీడ్‌బాల్స్ పంపిణీ



సీడ్ బాల్స్ పంపిణీ చేస్తున్న డీజీ డా. సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకంలో భాగంగా రెండు లక్షల సీడ్ బాల్ తయారీకి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్యమిశ్రా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చంచల్‌గూడలోని పెట్రోల్ బంకులో వినియోగదారులకు ఖైదీలు తయారు చేసిన సీడ్ బాల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో అటు పర్యావరణానికి, ఇటు జీవరాసికి ఎంతో హాని కలుగుతుందన్నారు. జైళ్ల శాఖ నిర్వహిస్తున్న 30 పెట్రోల్ బంకులు కేంద్రంగా వాహనదారులకు ముఖ్యంగా ఫోర్ వీలర్స్ యాజమానులకు ఈ సీడ్ బాల్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐజీలు రాజేష్, మురళీ బాబు, డీఐజీలు డా. శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్‌లు నవాబు శివకుమార్‌గౌడ్, సంతోష్‌రాయ్ పాల్గొన్నారు.

అత్యుత్తమ బోధనా పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

సైదాబాద్: ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధనా పద్ధతులను పాటించాలని సైదాబాద్ మండల విద్యాశాఖ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ సూచించారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో సైదాబాద్ మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జాతీయ విద్యా విధానంపై ట్రాన్స్‌ఫామింగ్ టీచర్స్ సమ్మిట్–2025 పేరిట ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వర్క్‌షాపు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశ బోధనలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గమనించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మసూద్ అహ్మద్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ లాస్య సాయి సింధు, మెంటార్ ధర్మేంద్ర కుమార్, అసోషియేషన్ ప్రతినిధులు సత్యం, మహ్మద్ సల్మాన్, అంకితారెడ్డి పాల్గొన్నారు.

రూ. 64 లక్షలతో రోడ్ల నిర్మాణం

మలక్‌పేట: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో గురువారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం రెడ్‌క్రాస్ హాస్పిటల్ వద్ద, దిల్‌సుఖ్‌నగర్ భవానినగర్‌రోడ్డు, సలీంనగర్ గ్రామీణ బ్యాంక్‌లైన్‌లో, శాలివాహననగర్ భాష్యం స్కూల్ వద్ద మొత్తం రూ.64 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల్లో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం జరిగితే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శరత్‌రెడ్డి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు దినేష్, సురేందర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

సైదాబాద్ పోలీస్ స్టేషన్ ముట్టడి

- ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్
- పోలీసుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆరోపణ



చిన్నారి మృతదేహంతో పీఎస్ ఎదుట బైఠాయించిన బాధితులు

సైదాబాద్: చంచల్‌గూడ చౌరస్తా సమీపంలో రహదారిపై కారు బీభత్సం సృష్టించడంతో చోటు చేసుకున్న ప్రమాదంలో మంగళవారం రాత్రి మహిళ మృతి చెందింది. గురువారం మృతురాలి చిన్న కూతురు కూడా చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదం జరిగి రెండ్రోజులైనా నిందితుడిని అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు గురువారం చిన్నారి మృతదేహంతో సైదాబాద్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. పీఎస్ ముందు నిరసనకు దిగిన వారు మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు బాధ్యతగా వ్యవహరించలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజులైనా నిందితుడిని అరెస్ట్ చేయకపోవటం అనుమానాలు కలిగిస్తుందని అన్నారు. ప్రమాదానికి కారణమైన నిందితుడిని విచారిస్తున్నామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రమాదంలో అతడికి కూడా గాయాలయ్యాయని ప్రమాదంలో ఒకరి కన్నా ఎక్కువ మంది చనిపోతే కేసు తీవ్రత పెరుగుతుందని నిందితుడిని అరెస్ట్ చేస్తామన్నారు.



సైదాబాద్ పీఎస్‌ను ముట్టడించిన మృతుల బంధువులు

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రెడ్ పెయింట్



హస్మత్‌అలీ

చాదర్‌ఘాట్: ప్రమాదకర మ్యాన్‌హోళ్లను ప్రజలు తేలికగా గుర్తించేందుకు వాటి మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నామని మలక్‌పేట జలమండలి డీజీఎం హస్మత్‌అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ పెయింట్ ఉంటుందో అది లోతైన మ్యాన్‌హోల్‌గా గుర్తించుకుని జాగ్రత్తగా వెళ్లాలన్నారు. మలక్‌పేట డివిజన్–1 వరద నీళ్ల వెళ్లే మార్గాలు, వరదనీళ్లు నిలిచే ప్రాంతాలు 20 ఉన్నాయని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్లు ఆరు అడుగుల లోతు కంటే తక్కువగా ఉన్నా వాటికి కూడా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలక్‌పేటలో ముంపు ప్రాంతాల్లో 829 లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించామని ఇవి ఆరు అడుగుల కన్నా ఎక్కువ లోతులో ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా వరద సమస్య తలెత్తితే 155313కి కాల్ చేయాలని సూచించారు.

యువ వైద్యుడి అదృశ్యం

సైదాబాద్: సర్టిఫికెట్స్ రెన్యువల్ కోసమని వెళ్లిన ఓ యువ వైద్యుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూసలబస్తీలో నివసించే వైద్యుడు సాయిరాం (32) తన సర్టిఫికెట్స్ రెన్యువల్ చేసుకోవడానికి కోఠిలోని ఐఎంఏ కార్యాలయానికి వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి రామకృష్ణ ఐఎంఏ కార్యాలయానికి వెళ్లి విచారించగా అక్కడికి రాలేదని తెలిపారు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గృహిణి ఆత్మహత్య



నవ్య (ఫైల్)

హస్తినాపురం: భర్త వేధింపులతో ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం టీ టైం కాంప్లెక్స్‌లో సురేష్–నవ్య (26) భార్యాభర్తలు ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. సురేష్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా దంపతుల నడుమ గొడవలు జరుగుతున్నాయి. సురేష్ వేధింపులు అధికం కావడంతో మంగళవారం రాత్రి నవ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలి తండ్రి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అబిడ్స్: ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ టీఎన్జీఓస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆదేశాల మేరకు టీఎన్జీఓస్ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఏపీ శ్రీధర్ నాయుడులు నూతన కమిటీని ఎంపిక చేశారు.

ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు మంత్రికి వినతి



కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చింతలకుంట నుంచి ఆటోనగర్, భాగ్యలత నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు నిర్మించే అండర్‌పాస్‌లకు బదులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని వివిధ కాలనీ వాసులతో కలిసి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని, వెహికిల్ అండర్‌పాస్‌నా, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలా? అనే విషయాన్ని జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు తేల్చుకోలేకపోవడంతో గత ఆరు నెలల నుంచి ఇక్కడ పనులు జరగడం లేదని దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

సాకేత్ డిగ్రీ కాలేజ్, సాయి డిగ్రీ కాలేజ్, స్ఫూర్తి డిగ్రీ కాలేజ్, సంతోషి మాతా టెంపుల్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ బస్‌డిపో, దిల్‌సుఖ్‌నగర్, రెడ్‌క్రాస్, గౌతంనగర్, చర్చ్, గడ్డిఅన్నారం, శాంతినగర్, లలితా నగర్‌చ మధురాపురి, కృష్ణానగర్, మైత్రీనగర్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు..

ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, ఇందిరా నగర్, డీబీఆర్ డయాగ్నస్టిక్స్ సెంటర్, ఎస్ఆర్ఎం కాలేజ్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ డిపో, లక్ష్మీ మోటార్స్, రేమాండ్స్ షోరూం, విజయా డయాగ్నస్టిక్ సెంటర్, మారుతి మందిర్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్, సవేరా టిఫిన్ సెంటర్, ఆర్ఎస్ బ్రదర్స్, జేసీ బ్రదర్స్, దిల్‌సుఖ్‌నగర్ ఆంధ్రాబ్యాంక్, రాజీవ్‌చౌక్, చాయ్‌ఘర్, సాయిబాబా టెంపుల్, వెంకటాద్రి నగర్, ఎస్‌బీహెచ్, ఆస్మాన్‌గఢ్, భూలక్ష్మీ నగర్ పరిసర ప్రాంతాలు.

హౌజింగ్ బోర్డు కాలనీ సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్ రావు

సైదాబాద్: సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీ సమగ్ర సంక్షేమానికి కృషి చేస్తామని కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాజిరెడ్డి, శ్యామ్‌సుందర్ రావు తెలిపారు. కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత నెల 18న కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శేషిరెడ్డి ఆధ్వర్యంలో ఏ.పుల్లారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నిర్వహించిన కాలనీ జనరల్ బాడీ సమావేశంలో జరిగిన ఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షురాలిగా సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారని వివరించారు. అయితే తన బాధ్యతల నుంచి గత జనరల్ బాడీ సమావేశంలోనే వైదొలిగిన పుల్లారెడ్డి కాలనీకి మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కాలనీవాసులను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. కాలనీవాసులు ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. త్వరలోనే కాలనీకి పూర్తిస్థాయి సంక్షేమ సంఘం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాలనీవాసులు విజయ్‌భాస్కర్, బీఎల్ నారాయణ, ఎన్ఎస్ఆర్ మూర్తి, ఎండీఎఫ్ ఖాన్‌లు పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు



స్వాధీనం చేసుకున్న మందులు చూపిస్తున్న అధికారులు

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రూ. 5.20 లక్షల విలువైన అనుమానిత మందులను స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ డీఐ గోవింద్ సింగ్, బేగంపేట డీఐ సురేంద్రనాథ్ పర్యవేక్షణలో సికింద్రాబాద్ ఏడీ డి. సరిత నేతృత్వంలో గురువారం మూసారంబాగ్ గ్లోని శైలజ ప్రైడ్ అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో పువ్వాడ లక్ష్మణ్ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో యాంటీ హైపర్టెన్సివ్, డయాబెటిస్, ఎంటీపీ కిట్లు, 4 రకాల మందులు స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ నిల్వలు చేసినందుకు మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.